ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 15 సెప్టెంబరు 2025

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విపక్షాల విమర్శలు

కృష్ణగిరి సభలో సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో ప్రజలకు చేయలేని విప్లవాత్మకమైన ఎన్నో పథకాలు అమలు చేస్తున్న డీఎంకే ప్రభుత్వంపై ప్రతిపక్షాలు పసలేని విమర్శలు, అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుండటాన్ని చూసి ఓర్వలేకే, కడుపుమంటతో ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కృష్ణగిరిలో ఆదివారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో రూ.270.75 కోట్లతో పూర్తయిన వివిధ పథకాలను ప్రారంభించి, రూ.562.14 కోట్లతో చేపట్టనున్న 1114 పథకాలకు శంకుస్థాపన చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల తరఫున లబ్దిదారులకు రూ.2,052 కోట్ల విలువైన సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభలో సీఎం మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వానికి ప్రజల మద్దతు, ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందని, తనను స్వాగతించడానికి ప్రతిచోటా ప్రజలు పెద్ద సంఖ్యలో ఎండవేడిమి కూడా పట్టించుకోకుండా రావడం వల్లే సభకు ఆలస్యంగా వచ్చానని తెలిపారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో ఎన్నో విదేశీ పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తికనబరచినా పట్టించుకోలేదని, పలు పరిశ్రమలు రాష్ట్రం నుండి వెళ్ళిపోవడానికి మాజీ ముఖ్యమంత్రి ఈపీఎస్ కారణమనే విషయం అందరికీ తెలుసునని స్టాలిన్ పేర్కొన్నారు. ఈపీఎస్ జరిపిన పెట్టుబడిదారుల సదస్సుల్లో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సిన పరిశ్రమలలో సగం పరిశ్రమలు కూడా రాష్ట్రానికి రాలేదన్నారు. తన హాయంలో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల్లో 77 శాతం కార్యరూపం దాల్చాయని, ఆ మేరకు కొత్త పరిశ్రమలు ఏర్పాటైనట్లు ప్రభుత్వ రికార్డులను చూసి ఈపీఎస్ తెలుసుకోవచ్చునని స్టాలిన్ సూచించారు. దక్షిణాసియాలోనే రాష్ట్రాన్ని పారిశ్రామిక ప్రగతి సాధించిన రాష్ట్రంగా తీర్చిదిద్దటమే తన ఆశయమన్నారు. అన్నాడీఎంకే సహా ప్రతిపక్షపార్టీలు డీఎంకే ప్రభుత్వంపై ఆచరణాత్మక, నిర్మాణాత్మక విమర్శలు చేయకుండా అసత్య ఆరోపణలే చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ద్రావిడ తరహా డీఎంకే పాలనలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని ఉత్తరాదికి చెందిన ప్రసార మాధ్యమాలు ప్రశంసిస్తున్నాయని, డీఎంకే ప్రభుత్వం దేశానికే మార్గదర్శక రాష్ట్రంగా ప్రజలకు సేవలందిస్తోందని ఆ మాధ్యమాలు ప్రకటిస్తున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. నీట్ రద్దు విషయంలో ఈపీఎస్‌లా తాము కపటనాటకాలేవీ ఆడటం లేదని, నీట్‌పై స్టే పొందటం సాధ్యం కాలేదన్న విషయాన్ని దాచిపెట్టడం లేదని, తమ ప్రభుత్వం చేస్తున్న సుదీర్ఘ న్యాయపోరాటం, ఆ పరీక్షల రద్దు కోసం రాజకీయ పరంగా చేస్తున్న ప్రయత్నాలు ఏదో ఒక రోజు సత్ఫలితాలనిస్తుందనే ఆశిస్తున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలోని 500ల హామీలలో 404 హామీలను నెరవేర్చామని, తక్కిన హామీలను కూడా నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని, వచ్చే యేడాది జరుగనున్న ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావటం ఖాయమని స్టాలిన్ పేర్కొన్నారు.


కొత్త పథకాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి

కృష్ణగిరికి వరాల జల్లు...

ఈ సభలో కృష్ణగిరి జిల్లాకు స్టాలిన్ ఐదు వరాలను ప్రకటించారు. అంజెట్టి ప్రధాన కేంద్రంగా కొత్త పంచాయతీ యూనియన్ ఏర్పాటు చేస్తామని, కెలమంగళంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక రూపొందిస్తామని, హోసూరులో రైల్వే గేట్ వద్ద కొత్త రైల్వే ఫ్లైఓవర్ నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. జిల్లాలో రూ.12 కోట్లతో కొత్త రహదారులు నిర్మిస్తామని, హోసూరు ఆస్పత్రి స్థాయి పెంచేందుకు తక్షణమే రూ.100 కోట్ల మేర నిధులు కేటాయించనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి చక్రపాణి, ఎంపీ గోపీనాథ్, ఎమ్మెల్యేలు మదిఅళగన్, ప్రకాష్, రామచంద్రన్, సత్యా, కృష్ణగిరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను అందజేస్తున్న స్టాలిన్

బంగాళాఖాతంలో అల్పపీడనం

● రాష్ట్రానికి 4 రోజులు భారీవర్ష సూచన

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా, రాష్ట్రంలో మంగళవారం నుంచి ఈ నెల 19వ తేది వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... ఉత్తర ఆంధ్రప్రదేశ్, దానికి ఆనుకుని దక్షిణ ఒడిశా తీరంలో శనివారం ఏర్పడిన అల్పపీడనం ఉత్తర తెలంగాణా, దానికి ఆనుకుని విదర్భ మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా పయనించి విదర్భ దానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల వైపుగా కదిలే అవకాశముంది. ఈ కారణంగా ఈ నెల 16 నుంచి 19వ తేది వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈరోడ్, కృష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూర్, సేలం, వేలూరు జిల్లాల్లో మంగళవారం ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీవర్షం కురిసే అవకాశముంది. బుధవారం కృష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూర్, సేలం, వేలూరు, రాణిపేట, కాంచీపురం, చెంగలపట్టు, తిరువణ్ణామలై, కళ్లకుర్చి, విల్లుపురం జిల్లాలు, 18న తిరువణ్ణామలై, కళ్లకుర్చి, విల్లుపురం కడలూరు, చెంగల్పట్టు, కాంచీపురం, అరియలూరు, పెరంబలూరు, మైలాడుదురై జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాలు, 19న తిరువళ్లూర్, రాణిపేట, వేలూరు, కాంచీపురం జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముంది. నగరంలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. దక్షిణ తమిళనాడు తీరప్రాంతాలు, మన్నార్ గల్ఫ్, పక్కనే ఉన్న కన్నియాకుమారి సముద్రంలో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, జాలర్లు ఆయా ప్రాంతాలకు వెళ్లరాదని వాతావరణ కేంద్రం తెలిపింది.

నగరంలో ఉరుములతో వర్షం...

రాజధాని నగరం చెన్నైలో ఆదివారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండగా, సాయంత్రం చల్లటి గాలులు వీచాయి. ఆదివారం వేకువజామున 3.30కు ప్రారంభమైన వర్షం ఉదయం 6 గంటల వరకు కురిసింది.

ఈశాన్య రుతుపవనాలతో అధిక వర్షపాతం...

ఈశాన్య రుతుపవనాలతో రాష్ట్రంలో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఈశాన్య రుతుపవనాలతో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అధిక వర్షపాతం నమోదువుతుంటుంది. ఆ ప్రకారం, అక్టోబరు మూడో వారంలో ప్రారంభమయ్యే రుతుపవనాలు డిసెంబరు వరకు ఉంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల కాలంలో అల్పపీడనాలు, తుఫానులుంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా, నవంబరు చివరిలో, డిసెంబరు ప్రారంభంలో వరుస తుఫాన్లు ఏర్పడే అవకాశముందని, ఇవి డెల్టా, ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్ర తీర ప్రాంతాల వైపు కదులుతాయి. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల కారణంగా జనవరి వరకు వర్షాలు పడే అవకాశముందని, జనవరి, ఫిబ్రవరిలో కూడా సాధరణం కన్నా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

ఆదర్శ వివాహాలకు అధిక ప్రాధాన్యం

● మహిళాభ్యుదయానికి అగ్రతాంబూలం ● డిప్యూటీ సీఎం ఉదయనిధి

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు దశాబ్దాల క్రితం పెళ్ళి పత్రికల్లో ఇరువైపు కుటుంబీకుల పేర్లకన్నా వారి కులానికే అధిక ప్రాధాన్యతనిచ్చేవారని, ప్రస్తుతం, ఆదర్శవివాహాలు జరుగుతుండగా, వాటిలో కులాంతర, ప్రేమ వివాహాలు అధికంగా ఉంటున్నాయని, దీనికి కారణం ద్రవిడ ఉద్యమ నేతలు పెరియార్, అన్నాదురై, కరుణానిధి చేసిన ఉద్యమాలే కారణమని డిప్యూటీ సీఎం ఉదయనిధి అన్నారు. రాజా అన్నామలైపురం అరుళ్‌మిగు కపాలీశ్వర కర్పగాంబాళ్ కల్యాణ మండపంలో ఆదివారం హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చెన్నై జిల్లా పరిధిలోని ఆలయాల తరఫున 32 జంటల వివాహం ఉదయనిధి సమక్షంలో జరిగాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేవాదాయ శాఖకు చెందిన ఆలయాల తరఫున రాష్ట్రమంతటా ఆదివారం 193 జంటలకు ఆదర్శ వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యేడాదిలోగా వెయ్యి జంటలకు ఉచిత పెళ్ళిళ్లు జరిపించాలని మే నెలలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారని, ఆ టార్గెట్‌ను అమలు చేయడానికి దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు కంకణం కట్టుకున్నారని, జూలైలోపే 775 జంటలకు పెళ్ళిళ్లు జరిపించారని, ప్రస్తుతం వెయ్యిపైగా జంటలకు వివాహాలు జరిపించి రికార్డు నెలకొల్పారని ప్రశంసించారు. తన సమక్షంలో పెళ్ళి చేసుకున్న జంటలతో మాట్లాడినప్పుడు వారిలో చాలా మంది ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలిసి సంతోషించానని ఎందుకంటే తనది కూడా ప్రేమ వివాహమన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రావటం వల్లే ఎన్నో యేళ్లుగా కుంభాభిషేకాలు జరగని ప్రాచీన ఆలయాలకు కుంభాభిషేకాలు జరిగాయని, ఇప్పటి దాకా రాష్ట్ర వ్యాప్తంగా 3700 ఆలయాలకు కుంభాభిషేకాలు ఘనంగా నిర్వహించామని వెల్లడించారు. ఆలయాల ఆధ్వర్యంలో కళాశాలలు ప్రారంభించడాన్ని తప్పుపట్టిన మాజీ సీఎం ఈపీఎస్‌కు సుప్రీం కోర్టు తీర్పు ద్వారా తగిన గుణపాఠం లభించిందన్నారు. ప్రస్తుతం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిరుపేద జంటలకు ఉచిత వివాహాలు చేయడంపై కూడా ఈపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని ఉదయనిధి అన్నారు.



నూతన వధూవరులతో ఉదయనిధి, మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ తదితరులు

మహిళల్లో పెరిగిన పొదుపు...

డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల మహిళల్లో పొదుపు పెరిగిందని, వెలుగుబాట ద్వారా సిటీ, టౌన్ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా నెలకు రూ.1000లను ఆదా చేయగలుగుతున్నారని, ఇలా ఎన్నో పథకాలు సత్ఫలితాలివ్వటం వల్లే రాష్ట్రం 11.19 శాతం ఆర్థికాభివృద్ధి సాధించగలిగిందని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, మేయర్ ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, ఎమ్మెల్యేలు డి.వేలు, జే కరుణానిధి, పర్యాటక శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మే మణివాసన్, జోనల్ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్లు సి.హరిప్రియ, కవిత, పి.జయరామన్, కేఎస్ మంగయర్‌కరసి తదితరులు పాల్గొన్నారు.

విజయ్ పర్యటనతో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం

● మంత్రి అన్బిల్ మహేష్ విమర్శ



ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పర్యటనలో సరైన ప్రణాళిక లేకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ విమర్శించారు. మంత్రి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, తిరుచ్చి జిల్లా అభివృద్ధికి డీఎంకే ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలుపరిచిన పథకాల గురించి విజయ్‌కు తెలియదన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుండి రాజకీయ పార్టీల నేతలు ప్రజల మద్దతు కోసం పర్యటనలు చేయడం ఆనవాయితీ అని, రాష్ట్ర చరిత్రలో పర్యటనలు చేపట్టిన సమయంలో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన దాఖలాలు లేవన్నారు. అయితే రాజకీయాల్లో అనుభవం లేకుండా కొత్తగా పార్టీ ప్రారంభించిన విజయ్ తాను పర్యటించే ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు పాటించాల్సిన నిబంధనల గురించి ముందుగానే తెలియజేయడం లేదని, అందువల్లే ప్రభుత్వ ఆస్తులను విజయ్ పార్టీ కార్యకర్తలు ధ్వంసం చేస్తున్నారని, వాటిని రాష్ట్రప్రజలు గమనిస్తూనే ఉన్నారని మంత్రి తెలిపారు.

నయనతార వెళ్లినా జనం వస్తారు....

● విజయ్‌పై సీమాన్ ఎద్దేవా

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీవీకే నేత, సినీ నటుడు విజయ్ ప్రచార పర్యటనకు లక్షలాదిమంది తరలివస్తున్నారంటూ ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ పేర్కొన్నారు. నటి నయనతార వెళ్ళినా, అజిత్ వెళ్ళినా విజయ్ పర్యటనకు హాజరైన జనం కంటే రెట్టింపు సంఖ్యలో గుమిగూడుతారని యెద్దేవా చేశారు. తిరుచ్చిలో శనివారం ఉదయం విజయ్ ప్రచారపర్యటనకు లక్షలాదిమంది హాజరయ్యారని చెబుతుండటం వింతగా ఉందని, సినీ హీరోలను చూడటానికి విపరీతంగా జనం పోగవటం సాధారణమైన విషయమేనని సీమాన్ పేర్కొన్నారు. ప్రచారపర్యటనకు వచ్చిన జనమంతా విజయ్ పార్టీకి ఓటు వేస్తారనే నమ్మకం లేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

వచ్చే యేడాది డిసెంబర్ నుంచే కులశేఖరపట్టినంలో రాకెట్ ప్రయోగం

● ఇస్రో చైర్మన్ నారాయణన్

పొత్తులపై జనవరి 9న ప్రకటిస్తా

డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

6 లో

ప్రతిభ గల క్రీడాకారులకు రాయితీలు

● ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ప్రభుత్వ రాయితీలు అందిస్తామని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో ఈపీఎస్ ప్రారంభించిన ప్రచార యాత్ర ఆదివారం కోవై జిల్లాకు చేరుకుంది. సింగానల్లూరు, సూలూరు, అవినాశి నియోజకవర్గాల్లో ఈపీఎస్ పర్యటించారు. ఇందులో భాగంగా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో కోవై, తిరుప్పూర్, నీలగిరి జిల్లాలకు చెందిన క్రికెట్ జట్లకు మాజీమంత్రి ఎస్పీ వేలుమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈపీఎస్ క్రీడా పరికరాలు అందజేశారు. అనంతరం అవినాశి నియోజకవర్గం సేవూరు రోడ్డు జంక్షన్‌లో జరిగిన రోడ్‌షోలో ఈపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవినాశి నియోజకవర్గ ప్రజలు 50యేళ్లకు పైగా ఎదురుచూసిన అవినాశి-అత్తికడవు తాగునీటి పథకాన్ని దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత ప్రకటించారని, అనారోగ్యం కారణంగా ఆమె మరణించిన తరువాత తాను సీఎం పదవి చేపట్టి ఇక్కడికి వచ్చి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అంతలో కరోనా మహమ్మారి కారణంగా 15శాతం నిలిచిపోయిన పనులను 2021లో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం కొనసాగించలేదన్నారు. తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక చివరి ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు సమృద్ధిగా సరఫరా అయ్యేలా వసతులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నందువల్లే ఇంటింటికీ వెళ్లి డీఎంకేలో సభ్యులుగా చేర్చుకునే పరిస్థితికి రావడం సిగ్గుచేటన్నారు.


క్రికెటర్లకు క్రీడా పరికరాలు అందజేస్తున్న ఈపీఎస్

రేపు హస్తినకు ఈపీఎస్...

ఢిల్లీలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ నేతలను కలిసేందుకు ఎడప్పాడి పళనిస్వామి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. దీని కారణంగా ఈ నెల 17, 18వ తేదీల్లో ముందే ప్రకటించిన కార్యక్రమాలను ఆయన రద్దుచేసుకున్నారు. మాజీ సీఎం జయలలిత మరణానంతరం అన్నాడీఎంకేలో గ్రూప్ రాజకీయాలు పెరిగాయి. జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ, టీటీవీ దినకరన్, ఒ.పన్నీర్ సెల్వం తదితరులు పార్టీకి గుడ్‌బై చెప్పివెళ్లిపోయారు. ఇంతే కాకుండా ఈపీఎస్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ మరో సీనియర్‌నేత సెంగోటయ్యన్ ఇటీవల ఢిల్లీ కూడా వెళ్లివచ్చారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 16న ఢిల్లీ వెళ్లేందుకు ఈపీఎస్ నిర్ణయం తీసుకున్నట్లు అన్నాడీఎంకే వర్గాలు తెలిపాయి.

22 నుంచే జీఎస్టీ తగ్గింపు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 22 నుంచే జీఎస్టీ సంస్కరణలు అమలులోకి రానుండటంతో 140 కోట్ల మంది పన్నుల భారం నుండి ఉపశమనం పొందనున్నారని, జీఎస్టీ తగ్గింపుతో ప్రజలలో అనవసరమైన ఖర్చు తగ్గుతుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆళ్వార్‌పేట మ్యూజిక్ అకాడమీలో ఆదివారం ఉదయం 'వికసిత్ భారత్ దిశగా పన్నుల సంస్కరణలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో జీఎస్టీ తగ్గింపునకు సంబంధించిన వివరాలతో బోర్డులు తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. జీఎస్టీ తగ్గింపు ప్రతి పౌరుడికి లభించిన భారీ విజయంగా భావించాలని, ప్రజలతోపాటు రాష్ట్రాలకు కూడా సవరించిన జీఎస్టీ ద్వారా ప్రయోజనం పొందుతాయన్నారు. జీఎస్టీ తగ్గించాలంటూ కొన్ని రాష్ట్రాలు పట్టుబట్టాయని, జీఎస్టీని తగ్గించాలని నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీని అభినందించడానికి ఆ రాష్ట్రాలు ప్రస్తుతం తటపటాయిస్తున్నాయని ఆమె వెల్లడించారు. ఎనిమిది నెలలుగా దేశవ్యాప్తంగా ఉత్పత్తులపై అధ్యయనం చేసి మరీ జీఎస్టీ సంస్కరణలు చేపట్టామని ఆమె వెల్లడించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల శివకాశి, చెన్నై ప్రాంతాల్లోని కాగితపు పరిశ్రమలు, తంజావూరు పారంపర్య బొమ్మలు, కుంభకోణం పంచలోహ విగ్రహాలు, శ్రీపెరంబదూరు, హోసూరు, కోవై ప్రాంతాల్లో తయారయ్యే వాహనాల విడిభాగాల ధరలు తగ్గుతాయన్నారు. అలాగే తిరుప్పూర్, కోవై, ఈరోడ్ ప్రాంతాల్లో తయారయ్యే రెడీమేడ్ దుస్తులు, బనియన్లు, హస్తకళా వస్తువులు, కాంచీపురం పట్టు, పొల్లాచ్చి, గాంగేయం, కడలూరు ప్రాంతాల్లో తయారయ్యే కొబ్బరిపీచు ధరలు కూడా ఘననీయంగా తగ్గుతాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వం, మిత్రపక్షాలు జీఎస్టీ పన్ను తగ్గింపు గురించి ప్రజలు సులువుగా అర్థం చేసుకునేలా ప్రచారం చేయాలని కేంద్ర మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, చెన్నై ఐఐటీ డైరెక్టర్ కామకోటి, రాష్ట్ర వ్యాపారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు విక్రమ్‌రాజా సహా పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.


సదస్సులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తదితరులు

సమాచార ధ్వని

11,240 కుటుంబాలకు బీమా కార్డుల పంపిణీ

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'నలం కాక్కుం స్టాలిన్' పథకంలో ఇప్పటివరకు, 11,240 కుటుంబాలకు ముఖ్యమంత్రి బీమా కార్డులు, 11,290 మంది దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం విడుదల చేసిన ప్రకటనలో... 'నలం కాక్కుం స్టాలిన్' పథకంలో ఇప్పటివరకు 185 శిబిరాలు నిర్వహించి, 17 రకాల ప్రత్యేక వైద్య సేవలతో పాటు పూర్తి శారీరక పరీక్షలు ఉచితంగా అందజేస్తున్నామని, ఈ శిబిరాల ద్వారా 3 లక్షల మంది ప్రయోజనం పొందారన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

సీఎన్‌జీ బస్సుల ద్వారా రూ.2 కోట్ల ఆదా

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ నడుపుతున్న 55 సీఎన్‌జీ బస్సుల ద్వారా ఏడాదికి రూ.2 కోట్లు ఆదా అయినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయమై రవాణా అధికారులు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ, డీజిల్ ఖర్చు తగ్గించేలా 'కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)'తో బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మొదటి దశలో జనవరిలో మూడు బస్సులు సీఎన్‌జీ టెక్నాలజీకి మార్చామని, వాటి ద్వారా రవాణా శాఖకు ఖర్చు తగ్గడంతో, విడతల వారీగా ప్రస్తుతం 55 సీఎన్‌జీ బస్సులు నడుపుతున్నామన్నారు. ఒక బస్సుకు కి.మీ రూ.3.89 ఇంధన ఖర్చు ఆదా అవుతున్నాయని, ఆ ప్రకారం ఇప్పవరకు రవాణా శాఖకు రూ.2 కోట్లు ఆదా అయిందన్నారు. దీంతో, మరో వెయ్యి బస్సులను సీఎన్‌జీ టెక్నాలజీకి మార్చే పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

రూ.220 కోట్ల బకాయిల వసూలు

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పంట, నగల రుణాల ఇస్తున్నాయి. రుణాలు పొందిన పలువురు అసలు కూడా చెల్లించడం లేదు. అందువల్ల, దీర్ఘకాల బకాయిలు వసూలుకు 2023లో సహకార శాఖ 'ప్రత్యేక రుణ పరిష్కారం' కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో, 2.10 లక్షల మంది నుంచి రూ.910 కోట్ల బకాయిలు వసూలుచేయాలని నిర్ణయించగా, ఈ కార్యక్రమం గడువు గత మార్చితో ముగిసింది. అనంతరం ఈ గడువు ఈ నెల 24వ తేది వరు పొడిగించారు. గడువు ముగిసేందుకు ఇంకా 10 రోజులు ఉన్న నేపథ్యంలో, ఇప్పటివరకు 45,010 మంది నుంచి రూ.220 కోట్లు బకాయిలు వసూలుచేసినట్లు సహకార శాఖ తెలిపింది.

పశువుల పెంపకంపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతిద): ఆవిన్ తరపున పశువులకు కృత్రిమ గర్భధారణ, ప్రథమ చికిత్సపై సర్టిఫికెట్ శిక్షణా కోర్సుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రకటించింది. ఈ మేరకు సంస్థ విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై, మదురై, సేలం, తిరునల్వేలి, వేలూరు, విల్లుపురం జిల్లాల్లో నిర్వహించే ప్రత్యేక శిక్షణా కోర్సులో కృత్రిమ గర్భధారణకు పశువులను సిద్ధం చేయడం, కృత్రిమ గర్భధారణ పద్ధతులు సమర్ధవంతంగా నిర్వహించడం, సంరక్షణ, ఆరోగ్యం సహా పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. 56 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణకు 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు http-s://candidate.tnskill.tn.gov.in/skillwallet/ course/4399 అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణలో పాల్గొనేవారికి సర్టిఫికెట్‌తో పాటు తమిళనాడు సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్యలో ఉద్యోగం పొందే అవకాశం కల్పించనున్నట్లు సంస్థ తెలిపింది.

లోక్ అదాలత్‌తో 90 వేల కేసుల పరిష్కారం

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో, పెండింగ్‌లో కేసులు సత్వరం పరిష్కరించేలా, ఏడాదిలో నాలుగు సార్లు జాతీయ లోక్ అదాలత్ జరుగుతోంది. ఆ ప్రకారం జాతీయ స్థాయిలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. మద్రాసు హైకోర్టు పరిధిలోని ఆరు సెషన్లు, హైకోర్టు మదురై బెంచ్‌లో మూడు సెషన్లలో కేసులు విచారించారు. అలాగే, జిల్లా, తాలూకా స్థాయిలో న్యాయమూర్తుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 501 సెషన్స్ ఏర్పాటుచేసి, ఈ లోక్ అదాలత్ ద్వారా 90,892 కేసులు పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా రూ.718.74 కోట్ల పరిహారం చెల్లించినట్లు తమిళనాడు రాష్ట్ర న్యాయసేవల కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

సోమ, మంగళవారాల్లో మురుగునీటి స్టేషన్ బంద్

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యారస్పాడి జీవా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా, అంబేడ్కర్ కాలేజీ రోడ్డు సమీపంలోని మురుగునీటి పైపులు మార్చనున్నారు. దీని కారణంగా సోమ, మంగళవారాల్లో రాయపురం, తిరువిక నగర్, అన్నానగర్, తేనాంపేట తదితర మండలాల్లో మురుగునీటి పంపింగ్ స్టేషన్లు పనిచేయవు. కొన్ని ప్రాంతాల్లో లీకయ్యే మురుగునీటిని లారీల ద్వారా తొలగించనున్నారు. మురుగునీరు లీకేజీపై రాయపురం-8144930905, తిరువికనగర్-8144930906, అన్నానగర్-8144930908, తేనాంపేట-8144930909 అనే నెంబర్లకు తెలియజేయాలని అధికారులు తెలిపారు.

19న విద్యా రుణాల ప్రత్యేక శిబిరం

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువేర్కాడులో ఈ నెల 19న విద్యా రుణాల ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లాకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్య కోసం విద్యా రుణాలు అందించనున్నామన్నారు. తిరువేర్కాడు ఎస్ఏ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఈ శిబిరం నిర్వహించనున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, సహకార బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు ఈ శిబిరంలో పాల్గొని, విద్యా రుణాలు మంజూరు చేయనున్నాయని తెలిపారు. బ్యాంకుల నుంచి ఇప్పటికే విద్యా రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కొత్త రుణాలు అవసరమైన విద్యార్థులు కూడా ఈ శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు.

వచ్చే యేడాది డిసెంబర్ నుంచే

కులశేఖరపట్టినంలో రాకెట్ ప్రయోగం

● ఇస్రో చైర్మన్ నారాయణన్



అద్దాలవంతెనపై సతీసమేతంగా నడుస్తున్న ఇస్రో చైర్మన్

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినంలో నిర్మిస్తున్న రెండో రాకెట్ ప్రయోగ కేంద్రం ద్వారా వచ్చే యేడాది డిసెంబర్ నుండి అంతరిక్షంలోకి రాకెట్లను ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. ఆదివారం ఉదయం ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో వివేకానంద స్మారక మండపం- తిరువళ్లువర్ విగ్రహం మధ్య ఉన్న అద్దాల వంతెనను సతీసమేతంగా ఆయన వీక్షించారు. ఆ అద్దాలవంతెనపై నడిచి తిరువళ్లువర్ విగ్రహాన్ని, ఆ తర్వాత వివేకానంద స్మారక మండపాన్ని సందర్శించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కులశేఖరపట్టినం రాకెట్ ప్రయోగ కేంద్రం కోసం తమిళనాడు ప్రభుత్వం 2300 ఎకరాలను సేకరించి ఇస్రోకు అప్పగించిందని, ప్రస్తుతం ఆ రాకెట్ ప్రయోగ కేంద్రం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. తిరువళ్లువర్ - వివేకానంద స్మారక మండపం నడుమ ప్రభుత్వం నిర్మించిన అద్దాల వంతెన అద్భుతంగా ఉందని, పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని ప్రశంసించారు.

రాష్ట్రంలో డీఎంకే కూటమి బలంగా ఉంది

● ఓట్ల చోరీకి ఆస్కారం లేదు
● కేంద్ర మాజీ మంత్రి చిదంబరం

అడయార్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే కూటమి బలంగా ఉందని, అందువల్ల ఓట్ల చోరీ జరిగే ఆస్కారం లేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం అభిప్రాయపడ్డారు. రామనాథపురంలో అఖిల భారత కాంగ్రెస్ జాలర్ల విభాగం ఆధ్వర్యంలో 'ఓట్ల చోరీకి అడ్డుకట్ట' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, గత లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోటీ జరిగిందన్నారు. ఒక దశలో ఇద్దరు అభ్యర్థులకు 3 లక్షల ఓట్లు వచ్చాయన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి బీజేపీ అభ్యర్థి 1.20 లక్షల ఓట్ల ఆధిక్యం సాధించి చివరకు 32 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినట్టుగా ప్రకటించారన్నారు. దీనిపై లోతుగా విచారణ జరుపగా అనేక ప్రాంతాల్లో ఓట్లను తొలగించడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో జీరో నంబరు సున్నా పేరుతో కొత్త ఓటర్లను చేర్చినట్లు తేలిందన్నారు. ఈ విధంగా బీజేపీ ఓట్ల చోరీ చేసి గెలిచిందని వెల్లడించారు. బిహార్‌లోనూ నిజమైన ఓటర్లను తొలగించి, నకిలీ ఓటర్లను చేర్చిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ కలిసి ఓ ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఓట్ల చోరీకి అవకాశం లేదన్నారు. ఎందుకంటే రాష్ట్రంలో డీఎంకే కూటమి బలంగా ఉందని పేర్కొన్నారు.

'రేడియం' పేరుతో మోసం

● 30 మంది అరెస్టు

అడయార్, సెప్టెంబరు 14: రేడియం ఖనిజాన్ని విక్రయించడం ద్వారా విదేశాల నుంచి కోట్లాది రూపాయల మేర అర్జించవచ్చంటూ అనేక మందిని నమ్మించి రూ.కోట్లు మోసం చేసిన కేసులో చెన్నై వాసితో పాటు మొత్తం 30 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను పరిశీలిస్తే... రిజర్వు బ్యాంకు పేరుతో నకిలీ ఆధారాలను సృష్టించి, చట్టవ్యతిరేకంగా చారిటబుల్ ట్రస్ట్ రిజిస్టర్ చేసి, వాటిద్వారా రేడియం విక్రయించి, విదేశాల నుంచి భారీ మొత్తంలో అర్జించవచ్చని కర్ణాటకకు చెందిన ముఠాలు అనేక మందిని నమ్మించాయి. ముందుగా రూ.లక్ష చెల్లిస్తే ఆ తర్వాత రూ.5 లక్షలు ఇస్తామని ప్రచారం చేశాయి. దీంతో అనేక మంది డబ్బు చెల్లించారు. ఇలాంటి వారిలో కొందరు తాము మోసపోయామని ఆలస్యంగా గ్రహించి, సేలం జిల్లా నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఇందులో మొదట 13 మందిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. రాష్ట్రంలో 43 ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో మరో నాలుగు ప్రాంతాల్లో పది మంది డీఎస్పీలు, 35 మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు తనిఖీలు చేశారు.. ఈ విచారణలో ఈ మోస పూరిత ముఠా నేతగా చెన్నైకు చెందిన ఎస్‌హెచ్ఎస్ స్వామినాథ అయ్యర్‌తో పాటు మొత్తం 30 మందిని అరెస్టు చేశారు. వీరిని మరింత లోతుగా ఈ మోసం కేసులో విచారణ జరుపుతున్నారు.

బైక్‌లకు నిప్పంటించిన అంబులెన్స్ డ్రైవర్ అరెస్ట్



దగ్ధమైన బైకులు

తిరుత్తణి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విభేదాల కారణంతో ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యుల వాహనాలకు నిప్పంటించిన అంబులెన్స్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా... తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని ఆర్కేపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉదయన్, అతడి మిత్రుడు రవి డాక్టర్లుగా పనిచేస్తున్నారు. గత కొన్నిరోజులుగా అంబులెన్స్ డ్రైవర్ కలైయరసన్ (29)కు ఆ ఇద్దరు వైద్యుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో కలైయరసన్ శనివారం సాయంత్రం ఆ ఇద్దరు వైద్యుల ద్విచక్ర వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. డ్యూటీ తరువాత వచ్చిన ఆ ఇద్దరు డాక్టర్లు బైక్‌లు దగ్ధమైన ఉండడం చూసి, ఆర్కేపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీ పరిశీలించగా అంబులెన్స్ డ్రైవర్ కలైయరసన్ దీనికి కారణమని నిర్ధారించిన పోలీసులు వెంటనే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరి డాక్టర్లతో విభేదాల కారణంగానే బైకులను నిప్పంటించినట్లు అతడు అంగీకరించడంతో, కోర్టు ఉత్తర్వుల మేరకు డ్రైవర్ కలైయరసన్‌ను రిమాండ్‌కు తరలించారు.

పొత్తుపై జనవరి 9న ప్రకటిస్తా

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



మణపారైరోడ్డులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ప్రేమలత

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో ఏ కూటమితో పొత్తుకుదుర్చుకోవాలనే విషయంపై జనవరి 9న కడలూరు జరిగే పార్టీ మహానాడులోనే ప్రకటిస్తామని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత అన్నారు. 'ఉల్లమ్ తేడి... ఇల్లమ్ నాడి, కెప్టెన్ రథయాత్తిరై పురట్చి పయనం' పేరుతో రాష్ట్ర వ్యాప్త ప్రచార పర్యటనను ఆమె ప్రారంభించారు. శనివారం తిరుచ్చిలో పార్టీ బూత్ కమిటీ ఇన్‌ఛార్జుల సమావేశంలో పాల్గొన్న ఆమె సాయంత్రం ముసిరి వద్ద కెప్టెన్ రథయాత్రలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం పార్టీ తిరుచ్చి సౌత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పార్టీ 21 వార్షికోత్సవాల ప్రారంభోత్సవం, విజయకాంత్ జయంతి నిర్వహించారు. మణపారై రోడ్డు ముళ్ళిపాడి వద్ద 734 అడుగుల ఎత్తులో పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ కోశాధికారి ఎల్కే సుధీష్, యువజన విభాగం కార్యదర్శి విజయ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ టీవీకే నేత విజయ్ ప్రారంభించిన ప్రచారం విజయవంతం కావాలని అభినందిస్తూ, ఒక్కో నేత ఒక్కో బాణీలో ప్రసంగిస్తారని, విజయ్ ప్రసంగిస్తున్న బాణీ వెరైటీగా ఉందని, పర్యటనలు, సభల్లో ఆయన ప్రసంగంపై విమర్శలు చేయడం తగదన్నారు. డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ కూడా రాజకీయ ప్రవేశం చేసిన తొలి రోజుల్లో ప్రస్తుతం విజయ్ ఎదుర్కొంటున్న సమస్యలను ఎదుర్కొన్నట్లు చెప్పారు. చిత్రసీమ నుండి రాజకీయాల్లోకి వచ్చేవారికి ఆటంకాలు అధికంగానే ఉంటాయని, ఆ గడ్డు పరిస్థితులను ఆరంభంలో తమ పార్టీ కూడా ఎదుర్కొన్నదని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. కాంచీపురం జిల్లా వయావూర్ సమీపంలో ఆదివారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో హరీష్, నిర్మల్ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన సంతోష్, వెంకటేష్‌లను ప్రభుత్వాసుపత్రికి, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

రిప్పన్ భవనాన్ని డ్రోన్‌తో చిత్రీకరిస్తున్న ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనాన్ని అనుమతి లేకుండా డ్రోన్ ద్వారా చిత్రీకరిస్తున్న ముగ్గురిని పోలీసులు విచారిస్తున్నారు. భవనంపై డ్రోన్ ఎగరడాన్ని గుర్తించిన పెరియమేడు పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని రాణిపేట జిల్లాకు చెందిన అజ్మత్, నరేష్ కుమార్, మహ్మద్ సైఫ్ తదితరులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పోలీసు శాఖ పనితీరుపై విమర్శ

● ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ పనితీరును సామాజిక మాధ్యమాల్లో విమర్శించిన ప్రత్యేక ఎస్ఐ సస్పెన్షన్‌కు గురయ్యాడు. తిరుప్పూర్ కార్పొరేషన్ పోలీసు విభాగంలో సైబర్ క్రైం ఎస్ఐగా మురుగన్ (56) పనిచేస్తున్నారు. ఉడుమలై కుడిమంగళం ప్రాంతంలో జూలైలో రాత్రి గస్తీ తిరుగుతున్న ప్రత్యేక ఎస్ఐ షణ్ముగవేలు హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసు శాఖ పనితీరును ఎస్ఐ మురుగన్ సామాజిక మాధ్యమాల్లో విమర్శించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా, పోలీసు కమిషనర్ ఉత్తర్వులతో ఏసీపీ విచారణ చేపట్టారు. ఆ ప్రకారం, ప్రత్యేక ఎస్ఐ మురుగన్‌ను సస్పెండ్ చేస్తూ సదరన్ మెట్రోపాలిటన్ అసిస్టెంట్ కమిషనర్ దీపా సత్యన్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

ధనుష్కోటి సమీపంలో అల్లం, బీడి ఆకుల స్వాధీనం

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకకు తరలించేందుకు ధనుష్కోటి సమీపంలో గుంతలో పాతిపెట్టిన 6 కిలోల బీడి ఆకులు, 118 కిలోల అల్లం తదితరాలను కోస్టుగార్డ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపం ధనుష్కోటిలో శ్రీలంకకు తరలించేందుకు కొన్ని వస్తువులు దాచారనే సమాచారంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు అల్లం, బీడి ఆకులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎవరు తరలిస్తున్నారనే దానిపై విచారణ చేపట్టారు.

పోలీసు వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తిరుత్తణి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనం ఢీకొనడంతో వృద్ధుడు మృతిచెందిన ఘటన తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో చోటుచేసుకుంది. తిరుత్తణి పోలీస్‌స్టేషన్‌లో మథియరసన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. కానిస్టేబుల్ అమరన్ నడుపుతున్న పోలీసు వాహనంలో స్టేషన్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీరాములు (84) హఠాత్తుగా ఆ వాహనానికి ఎదురవడంతో అదుపుతప్పి ఆ వృద్ధుడిని ఢీకొన్నట్లు సమాచారం. గాయపడిన శ్రీరాములును వెంటనే ఎస్ఐ దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక ఆదివారం సాయంత్రం శ్రీరాములు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా శ్రీరాములు కుమారుడు న్యాయవాది బాలసుబ్రహ్మణ్యం సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తిరుచ్చిలో చెన్నై వ్యాపారి వద్ద

పది కిలోల బంగారం దోపిడీ

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపం చెన్నై బైపాస్‌రోడ్డులో కారులో వస్తున్న నగల వ్యాపారిపై గుర్తుతెలియని దుండగులు దాడి చేసి 10 కేజీల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. షావుకారుపేటలో ఆర్కే జ్యూవలర్స్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా పలు నగల దుకాణాలకు బంగారు, వెండి ఆభరణాలను సరఫరా చేస్తోంది. ఆ సంస్థ మేనేజర్ ఈ నెల 8న నగరం నుండి బంగారు నగలతో దిండుగల్ వెళ్లారు. అక్కడి దుకాణాలకునగలను సరఫరా చేసిన మీదట, పది కేజీల బంగారు నగలతో చెన్నై తిరుగు ప్రయాణమయ్యారు. మేనేజర్‌తోపాటు మరో ముగ్గురు సిబ్బంది కారులో ఉన్నారు. శనివారం రాత్రి తిరుచ్చి - చెన్నై బైపాస్‌రోడ్డులోని కొనలై ప్రాంతం వద్ద మూత్ర విసర్జన కోసం మేనేజర్ కారు ఆపారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కొంతమంది దుండగులు మేనేజర్, ముగ్గురు సిబ్బందిపై మిరపపొడి చల్లి, కారు అద్దాలను పగులగొట్టి 10 కేజీల బంగారు నగలను దోచుకుని పరారయ్యారు. ఈ సంఘటనపై మేనేజర్ సమయపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి దోపిడీ దొంగల ఆచూకీ కోసం 4 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

13వ శతాబ్దం నాటి శిలాశాసనం లభ్యం



తవ్వకాల్లో బయల్పడిన శిలాశాసనం

ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా విరాళిమలై సమీపంలో 13వ శతాబ్దం నాటి శిలా శాసనం లభ్యమైంది మైలాపట్టిలో రాష్ట్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తవ్వకాల్లో దక్షిణ భారతాన్ని పరిపాలించిన వీరపాండియన్ కాలం నాటి శిలాశాసనం బయల్పడినట్లు ప్రొఫెసర్ ముత్తలగన్ పేర్కొన్నారు. ముత్తలగన్ నేతృత్వంలో పురావస్తుశాఖకు చెందిన నారాయణమూర్తి, రాహుల్ ప్రశాంత్‌తో కూడిన బృందం మైలాపట్టి కొండపై శిథిలావస్థకు చేరుకున్న శివాలయంలో పరిశోధనలు చేశారు. అందులో ముక్కలై ఉన్న ఓ శిలాశాసనాన్ని వారు గుర్తించారు. దీని చరిత్ర గురించి ముత్తలగన్ మీడియాతో మాట్లాడుతూ, 13వ శతాబ్దంలో దక్షిణ భారతాన్ని పరిపాలించిన త్రిభువనం చక్రవర్తుల వంశానికి చెందిన వీరపాండ్యదేవర్ మైలాపట్టి కొండపై ఈ శివాలయాన్ని నిర్మించి నిత్య పూజలు జరిపించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆలయ నిర్వహణకు పండస్‌తోట ప్రాంతంలో వ్యవసాయ భూములను దానంగా ఇచ్చి అందులో పండించే ధాన్యాన్ని మాన్యంగా అందజేసిన వివరాలు ఆ శిలాశాసనంలో ఉన్నాయని తెలిపారు. ఇది 1,361లో చెక్కారని, ఈ శివాలయంలో రాసరాశీశ్వర ముడయార్ పూజలందుకున్నారని, అదేవిధంగా ఆలయంలో ముక్కలైన శివలింగం, విఘ్నేశ్వరుని శిల్పాలు కూడా శిథిలావస్థలో ఉండటాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ

● టీటీవీ దినకరన్

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ ఉంటుందని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. అరియలూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... విజయ్ ప్రచారంలో ఎక్కువగా యువతీ, యువకులు, 40 ఏళ్లలోపున్న వారు పాల్గొన్నారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలో తమిళగ వెట్రి కళగం నేతృత్వంలో కూటమి ఏర్పాటవుతుందని, ఆ కూటమిలో తాము చేరుతామా, లేదా అన్నది ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. అలాగే, సీమాన్ నేతృత్వంలో మరో కూటమి ఉంటుందని, అందువల్ల అసెంబ్లీ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ ఉంటుందని అన్నారు. ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఈపీఎస్ పేరు ప్రతిపాదించకూడదని తాము కోరుతున్నామని, ఒకవేళ తమ డిమాండ్ అంగీకరిస్తే ఎన్డీఏ కూటమిలో చేరే అవకాశముంటుందని దినకరన్ తెలిపారు.

శునకం దాడికి గురై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మహ్మద్ నసీరుద్దీన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో శునకం దాడికి గురై చికిత్స పొందుతున్న మహ్మద్ నసీరుద్దీన్ (50) మృతిచెందాడు. జూలైలో మీరసాగిపేట సమీపంలో శునకం దాడిలో నసీరుద్దీన్‌కు గాయాలయ్యాయి. రాయపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జి అయ్యారు. ఈ నెల 12న ఆయన జ్వరం బారిన పడడంతో కుటుంబ సభ్యులు రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక నసీరుద్దీన్ మృతిచెందాడు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'రోబోటిక్స్ ల్యాబ్'

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో రూ.15.43 కోట్లతో 'రోబోటిక్స్' ల్యాబ్‌లు ఏర్పాటుకానున్నాయి. 9 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులకు 'రోబోటిక్స్‌'కు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేలా జిల్లాకు ఒక పాఠశాల చొప్పున 38 పాఠశాలల్లో ఈ ల్యాబ్‌లు ఏర్పాటుచేయనున్నారు. ఆ ప్రకారం, కోయంబత్తూర్ విద్యా జిల్లా పరిధిలో అరసూరు మహోన్నత పాఠశాల, పొల్లాచ్చిలో టి.నల్లిగౌండర్‌పాళయం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఎంపిక చేశారు. అందులో, అరసూరు పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల విద్యార్థులు ఈ ల్యాబ్ సందర్శించేలా అవసరమైన వసతులు కల్పించనున్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ... విద్యార్థుల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ నైపుణ్యత మెరుగుపరిచడం, రోబోటిక్స్ ఆవిష్కరణలు ప్రోత్సహించడం, అవసరమైన అన్ని సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ల్యాబ్ ఏర్పాటుచేశామని, అక్టోబరులో ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

అరెస్టు నుంచి తప్పించుకునేందుకు 12 యేళ్ళుగా దీక్షలో ఉన్న రౌడీ

అడయార్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో 12 యేళ్ళుగా తప్పించుకుని తిరుగుతున్న రౌడీని పోలీసులు అరెస్టు చేశారు. ఈ 12 యేళ్ళపాటు పోలీసులు గుర్తించకుండా దీక్షా జీవితాన్ని గడిపినట్లు విచారణలో వెల్లడించాడు. పోలీసుల కథనం మేరకు.. పెరంబూరు ఏకాంగిపురం రెండో వీధికి చెందిన జానకిరామన్ (41)పై అనేక కేసులున్నాయి. పోలీసులకు చిక్కకుండా 12 యేళ్ళుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇందుకోసం ఆ రౌడీ దీక్ష చేస్తున్నట్టుగా నమ్మించి పోలీసులు గుర్తుపట్టకుండా తన వేషం మార్చుకున్నాడు. అయితే కుటుంబానికి చెందిన ఒక వ్యక్తితో మాత్రం టచ్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తి మొబైల్ ఫోన్ ట్రాప్ చేసిన పోలీసులు రౌడీ జానకిరామన్‌తో మాట్లాడడం నిర్ధారించుకున్న తర్వాత ఆ వ్యక్తి సాయంలో అజ్ఞాతంలో ఉన్న రౌడీ జానకిరామన్‌ను ఒట్టేరి పోలీసులు అరెస్టు చేశారు.

మొసలి దాడిలో విద్యార్థి మృతి



మునీశ్వరన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల తో సరదాగా చేపలు పట్టేందుకు వెళ్లిన కళాశాల విద్యార్థి మొసలి దాడిలో మృతిచెందిన ఘటన తిరువణ్ణామలైలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. సాతనూరు ప్రాంతానికి చెందిన మునీశ్వరన్ (18) తిరువణ్ణామలై ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నాడు. ఆదివారం ఉదయం సాతనూరు డ్యాంలో చేపల పట్టేందుకు స్నేహితులతో కలసి మునీశ్వరన్ వెళ్లాడు. అతను తీరంలో కూర్చుని చేపలు పడుతుండగా హఠాత్తుగా నీటి నుంచి బయటకు వచ్చిన మొసలి, మునీశ్వరన్ కాలు నోటితో పట్టుకుని నీటిలోకి లాక్కెళ్లింది. మునీశ్వరన్ కేకలతో అతడిని రక్షించేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొద్దిసేపటికి అతని మృతదేహాన్ని స్నేహితులు వెలికితీశారు. సమాచారం అందుకున్న సాతనూరు పోలీసులు అక్కడకు చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అనాథల చదువు కోసం 'అన్బుకరంగళ్' పథకం

● నేడు ప్రారంభించనున్న సీఎం స్టాలిన్

అడయార్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల చదువుల కోసం డీఎంకే ప్రభుత్వం ఓ పథకానికి శ్రీకారం చుట్టనుంది. 'అన్బుకరంగల్' అనే పథకం కింద నెలకు రూ.2 వేల ఆర్థిక సాయం చేయనుంది. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఆ మేరకు చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను ఆదుకునేలా అన్బుకరంగల్ పథకాన్ని రూపొందించింది. ఈ పథకం కింద తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు,, తల్లిదండ్రుల్లో ఒకరు మరణించి సంరక్షకుల పెంపకంలో ఉన్న చిన్నారులకు 18 యేళ్ళ వరకు వారి చదువుకు ఎలాంటి అంతరాయం లేకుండా నెలకు రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రభుత్వం అందజేస్తుంది. అదేవిధంగా పాఠశాల విద్య పూర్తి చేసిన తర్వాత ఆ విద్యార్థులు కాలేజీ చదువులకు వీలుగా ఎలాంటి అంతరాయం లేకుండా సాఫీగా సాగిపోయే ఈ పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ కలైవానర్ అరంగంలో సోమవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు నేరుగా నిధులు

● రిజర్వ్ బ్యాంక్ ఖాతాలు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రాజెక్టులకు సంబంధించిన నేరుగా నిధులు పంపించే చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్‌లో 92 వేర్వేరు ఖాతాలు ప్రారంభించింది. గ్రామీణాభివృద్ధి, ప్రజా ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, పర్యావరణ అభివృద్ధి, వ్యవసాయం తదితర రంగాల్లో కేంద్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులు అమలుచేస్తోంది. ఈ నిధులు ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లో నేరుగా ప్రాజెక్టులు అమలుచేయలేదు. రాష్ట్ర ప్రభుత్వాలే ఈ నిధులతో వేర్వేరు పేర్లతో పథకాలు అమలుచేస్తుంటాయి. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం అందించే నిధులు రాష్ట్ర ప్రభుత్వ శాఖల ట్రెజరీ ఖాతాల్లోకి చెల్లిస్తుంటారు. ఈ విధంగా అందుతున్న నిధులు కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలను సక్రమంగా నెరవేరుస్తున్నాయా? లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది. కొన్ని సమయాల్లోనిర్ణీత ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఇతరత్రా పనులకు వినియోగిస్తుంటాయని, అందువల్ల ఆ పథకాలు ప్రజల చెంతకు చేరడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ సమస్య పరిష్కరించేలా కేంద్రం కొత్త విధానం ప్రవేశపెట్టింది. ఆ ప్రకారం కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు నిధులు పొందేందుకు, రిజర్వ్ బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వం ఒక ఖాతా ప్రారంభించాలి. ఆ ఖాతాలో సంబంధిత ప్రాజెక్ట్ పని, నిర్వహిస్తున్న కంపెనీ లేదా వ్యక్తుల వివరాలుంటాయి. ప్రాజెక్ట్ పనులు పూర్తయినట్లు ప్రకటించినప్పుడు, కేంద్ర ప్రభుత్వ నిధులు రిజర్వ్ బ్యాంక్ నుంచి నేరుగా సంబంధిత సంస్థ లేదా వ్యక్తులకు వెళ్తాయి. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ అధికారి ఒకరు మాట్లాడుతూ... ప్రాజెక్ట్ ఖర్చులు నేరుగా చెల్లించే విధానాన్ని కేంద్రం 2024-25వ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిందని, అందులో రాష్ట్రాన్ని చేర్చారని తెలిపారు. ఆ ప్రకారం రాష్ట్రానికి సంబంధించి 96 ప్రాజెక్టులను కేంద్రం నిధుల ప్రాజెక్టుల్లో చేర్చారన్నారు. వీటిలో 92 ప్రాజెక్టులకు ట్రెజరీ శాఖ ద్వారా నిధులు పొందేందుకు రిజర్వ్ బ్యాంక్‌లో ఖాతాలు ప్రారంభించామని, మొదటి దశలో 46 ప్రాజెక్టులకు కేంద్రం నిధులు నేరుగా విడుదల చేసి, సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు అధికారి తెలిపారు.

చిత్రజ్యోతి


'ది డార్క్ హెవెన్'లో సిద్ధు

జానపద కథ ఆధారంగా 'ది డార్క్ హెవెన్'

తమిళ చిత్రపరిశ్రమలో ప్రయోగాత్మకంగా జానపద కథ ఆధారంగా చేసుకుని 'ది డార్క్ హెవెన్' అనే చిత్రం తెరకెక్కింది. హాలీవుడ్‌లో పురాణాలు, ఇతిహాసాలు, పాత సంప్రదాయ కథల ఆధారంగా సినిమాలు తీయడం అలవాటు. ఇపుడు ఈ తరహానే రూపొందించిన ఈ చిత్రాన్ని 'డీ3' ఫేం బాలాజీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా వివరాలను ఆయన వెల్లడిస్తూ, 'ఒక గ్రామంలో జరిగే వరుస హత్యలపై స్క్రీన్‌ప్లే సాగుతుంది. ఆ గ్రామంలో క్రమం తప్పకుండా ఏడేళ్ళకు ఒకరు అనుమనాస్పదంగా మరణిస్తుంటారు. ఈ మరణాల వెనుక ఉన్న వారెవరు అనేది పోలీస్ అధికారి ఎలా వెలికితీశాడన్నదే చిత్ర కథ. ఇందులో పోలీస్ అధికారిగా సిద్ధు నటించారు. హీరోయిన్‌గా 'బిగ్ బాస్' ఫేం దర్శి నటించారు. ఇతర పాత్రల్లో వేల రామమూర్తి, రితిక, అరుళ్ జ్యోతి, ప్రదీప్, జయకుమార్ జానకి రామన్ నటించారు. ఇప్పటివరకు హాస్య పాత్రలకు పరిమితమైన చాప్లిన్ బాలు ఇందులో ఒక ముఖ్య పాత్ర పోషించారు.



సీఎం స్టాలిన్ వినతిని నెరవేరుస్తా

● ఇళయరాజా

సంగ తమిళ్, సంగ తమిళ సాహిత్యాలకు సంగీతాన్ని సమకూర్చి ఆల్బమ్ విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చేసిన వినతిని నెరవేరుస్తానని దిగ్గజ సంగీత దర్శకుడు 'ఇసైజ్ఞాని' ఇళయరాజా వెల్లడించారు. ఈ విషయంపై ఇళయరాజా తన 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియో రిలీజ్ చేశారు. 'ఇందులో తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన సన్మాన కార్యక్రమంతో నేను ఉబ్బితబ్బిబ్బై పోయాను. ఈ ఆనందంలో ఏమి మాట్లాడలేకపోయాను. ఈ వేడుకను ఎంతో ఘనంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు, రాష్ట్ర మంత్రులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ వేడుకకు హాజరై గౌరవించినందుకు సూపర్‌స్టార్ రజనీకాంత్, 'ఉలగ నాయగన్' కమల్ హాసన్‌కు, రాష్ట్ర ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అదేసమయంలో ఈ వేదిక ద్వారా సీఎం స్టాలిన్ చేసిన వినతిని స్వీకరిస్తూ, సంగ తమిళ సాహిత్య గ్రంథాలకు సంగీతం సమకూర్చి ఆల్బమ్'గా రూపొందిస్తానని ఇళయరాజా పేర్కొన్నారు.

దివ్యాంగ డ్యాన్సర్లపై లారెన్స్ కనకాభిషేకం


దివ్యాంగ డ్యాన్సర్లకు కరెన్సీ అభిషేకం

ప్రతిభను ప్రోత్సహించడంలోనూ, సామాజిక సేవ చేయడంలో ముందుండే ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్, దర్శకుడు, నిర్మాత, హీరో రాఘవ లారెన్స్ తాజాగా దివ్యాంగ యువ డ్యాన్సర్లపై కరెన్సీ వర్షం కురిపించారు. నృత్యంపట్ల దివ్యాంగులకు ఉన్న అభిరుచిని గుర్తించి, ప్రోత్సహించాలనే లక్ష్యంతో వారి కోసం ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి సంబంధించిన విషయాన్ని లారెన్స్ సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో షేర్ చేశారు. ఇందులో 'నా బాల్యంలో ఆలయ వేడుకలకు వెళ్ళి డ్యాన్సులు వేసేవాడిని. ఆ సమయంలో ప్రేక్షకులు నా చొక్కాకు రూపాయి నోటు కుట్టేవారు. పూల దండలు వేసేవారు. అది నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చేది. అలాంటి అనుభూతిని నా బాయ్స్‌కు కూడా ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో వారిపై కరెన్సీ వర్షం కురిపించాను. ఇది కేవలం ప్రశంస కాదు.. ప్రోత్సాహం కూడా. అంతేకాకుండా, మీ ఇళ్ళలో జరిగే వేడుకలను వారిని ఆహ్వానించి ప్రదర్శనకు అవకాశం కల్పించండి. వారి నృత్యం చూస్తే మీరు ఆనందించడమే కాదు వారి ప్రదర్శన ఎంతో మందికి స్ఫూర్తినివ్వడంతో పాటు సంతోషాన్ని కలిగిస్తుంది' అని లారెన్స్ పేర్కొన్నారు.



నాలుగు పదులు దాటినా.. వన్నె తగ్గని అందం

● మోడ్రన్ దుస్తుల్లో మైమరిపిస్తున్న శ్రియ

ఒకపుడు స్టార్ హీరోయిన్‌గా వెలిగిన శ్రియ ఇపుడు నాలుగు పదుల వయసులోనూ బికినీ, మోడ్రన్ దుస్తులు ధరించి అభిమానుల మతిపోగొడుతున్నారు. తాజాగా తన 41వ పుట్టిన రోజు వేడుకలను భర్త, పిల్లలతో కలిసి శ్రీలంకలో జరుపుకున్నారు. అక్కడ ఆమె బికినీ ధరించి హల్‌చల్ చేశారు. పైగా 40 యేళ్ళు దాటినప్పటికీ ఆమె ఎంతో ఫిట్నెస్‌గా ఉన్నారు. అందుకే శ్రియ ఈ వయసులో కూడా మోడ్రన్ దుస్తుల్లో యువతను ఆకట్టుకుంటున్నారని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కాగా, సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'శివాజీ' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన శ్రియ.. ఆ తర్వాత తమిళంలో ఆమెకు సరైన అవకాశాలు రాలేదు. అదేసమయంలో రష్యాకు చెందిన వ్యాపారవేత్తను వివాహం చేసుకుని ఓ బిడ్డకు జన్మనిచ్చారు.

దీపావళికి కొత్త రకం బాణసంచా సిద్ధం

● శివకాశిలో జోరందుకున్న విక్రయాలు


సింహం, పులి టపాసు

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శివకాశిలో దీపావళి బాణసంచా విక్రయాలు జోరందుకున్నాయి. ఈ ఏడాది కొత్త రకం బాణసంచా పరిచయం చేశారు. దేశంలోనే విరుదు నగర్ జిల్లా శివకాశి బాణసంచా తయారీకి పేరుగాంచింది. విరుదునగర్, శివకాశి, సాత్తూర్, వెంబకోట ప్రాంతాల్లో నాగ్‌పూర్, చెన్నై టీఆర్‌ఓ లైసెన్స్ పొందిన 1,080 బాణసంచా కర్మాగారాలుండగా, సుమారు 4,000 దుకాణాలున్నాయి. ఈ ఏడాది దీపావళి పండుగకు ఇంకా 37 రోజులుండడంతో పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఆర్డర్లు వస్తుండగా, మరికొందరు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారుల రాకతో శివకాశిలోని దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. అదే సమయంలో 5 నుంచి 10 శాతం మేర బాణసంచా ధరలు పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై తమిళనాడు బాణసంచా వ్యాపారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఇళంగోవన్ మాట్లాడుతూ... ఉత్పత్తి తగ్గడంతో ఈ ఏడాది బాణసంచా కొరత ఏర్పడే అవకాశముందన్నారు. ప్రస్తుతం వ్యాపారం జోరుగా సాగుతుండడంతో, దీపావళికి ముందుగానే వ్యాపారం పూర్తయ్యే అవకాశముందని ఇళంగోవన్ తెలిపారు. కాగా, బాణసంచాసంచా కర్మాగారాల్లో సంభవిస్తున్న ప్రమాదాలను నిరోధించేలా అధికారులు తరచూ కర్మాగారాల్లో తనిఖీ చేయడం, కురుస్తున్న వర్షాలు సహా పలు కారణాలతో ఈ ఏడాది 10 శాతం మేర బాణసంచా ఉత్పత్తి తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.


గిటార్ టపాసు





కొత్తరకం బాణసంచా...

ఈ ఏడాది దీపావళికి కొత్తగా ప్రజలను ఆకర్షించేలా పలు రకాల టపాసులు సిద్ధమయ్యాయి. వాటిలో పుచ్చకాయ టపాసు, కుంగ్ ఫూ పాండా, జంగిల్ టెంటా, పిజ్జా, ఓరియో, హాట్ మిర్చి, నరుటో యానిమేషన్, గిటర్, రాక్ స్టార్ తదితర రకాల టపాసులు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

పుచ్చకాయ పేలుడు: ఒకసారి వెలిగించిన తర్వాత, ఎరుపు, పసుపు రంగు నిప్పురవ్వలు ఎగురుతూ పెద్ద శబ్దంతో పేలుతూ ఆహ్లాదం కలిగిస్తుంది.


కుంగ్ ఫూ పాండా: ఈ బాంబు పేల్చినప్పుడు, ఎరుపు, పసుపు నిప్పురవ్వలతో ఎగురుతూ, సుమారు 20 అడుగు ఎత్తు వరకు ఎగిరి జలపాతంలా పడిపోతుంది.

జంగిల్ టెంటా: సింహం లేదా పులి వంటి జంతువుల ఆకారంలో ఉన్న ఈ టపాసు వెలిగించినప్పుడు, జంతువుల నోటి నుంచి నిప్పురవ్వలు వెలువడతాయి. **పిజ్జా:** ఆరు రకాల పిజ్జా ఆకారంలో తయారైన ఈ టపాసు, మండించినప్పుడు చిన్న శబ్దంతో వివిధ రంగుల్లో పేలిపోతుంది. **ఓరియో:** ఈ టపాసు వెలిగిస్తే, అది నిప్పురవ్వలతో పాటు ఎగురుతుంది. **హాట్ మిర్చి:** ఈ టపాసు మండిస్తే, చిన్న శబ్దంతో పేలుతుంది. ఈ టపాసు చేతిలో పట్టుకుని కూడా భయం లేకుండా పేల్చవచ్చు. అలాగని, ఇంట్లోకి తీసుకెళ్లరాదు.

నరుటో యానిమేషన్: ఈ టపాసు మండిస్తే, పదడుగుల వరకు ఉచ్చులా ఎగిరి, 20 అడుగులకు చేరుకుని పేలిపోతుంది.

గిటార్: ఈ టపాసు చేతిలో పట్టుకుని పేల్చవచ్చు, ఒక సారి వెలిగిస్తే, వెండి రంగులు వెదజల్లుతూ ఎగురుతుంది.

వైభవంగా వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మనవరాలి వివాహం


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఏపీ గవర్నర్ దంపతులు

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వీఐటీ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మనవరాలు కాదంబరి ఎస్.విశ్వనాథన్ వివాహం ఆదివారం తిరుపతిలో వైభవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులతో పాటు వివిధ రంగాల ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు ఈ వివాహానికి హాజరయ్యారు. నూతన వధూవరులు కాదంబరి ఎస్.విశ్వనాథన్, డాక్టర్ ఎ.శ్రవణ్ కృష్ణకు గవర్నర్ దంపతులు ఆశీస్సులందజేశారు. ఈ వేడుకలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాధన్, శేఖర్ విశ్వనాథన్, జీవీ సెల్వంతోపాటు రమణి బాలసుందరం, సంధ్యా పెంటారెడ్డి, అనుషా సెల్వం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాసవీ ప్రీమియర్ లీగ్-టీ7 టోర్నీ


ప్రారంభోత్సవంలో వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్స్ నిర్వాహకులు ఇరుకుల రామకృష్ణ, సుజాతా రమేష్‌బాబు, ఒలింపియన్ దేవరాజన్ తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వాసవీ ప్రీమియర్ లీగ్-టీ7 వన్‌డే టోర్నమెంట్ ఆదివారం పెరంబూరులోని ఎస్‌వీఆర్ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగింది. క్లబ్ ఇంటర్నేషనల్ కోశాధికారి, ప్రాజెక్ట్ చైర్మెన్ సుజాతా రమేష్‌బాబు అధ్యక్షత వహించిన ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ జ్యోతిప్రజ్వలన చేశారు. పలు రాష్ట్రాల్లోని వాసవీ క్లబ్‌లకు చెందిన 13 టీమ్‌లు హాజరై ప్రతిభ కనబరిచాయి. ఇంటర్నేషనల్ క్లబ్ నిర్వాహకులు శిద్దా వెంకట సూర్య ప్రకాష్‌రావు, గార్లపాటి శ్రీనివాసరావు, బోడా సాయి సూర్యప్రకాష్ రావు, ఆర్.రవిచంద్రన్, డాక్టర్ సెంథిల్‌కుమార్, వాసవీ క్లబ్‌లకు చెందిన 10 జిల్లాల గవర్నర్లు పాల్గొన్న ఈ పోటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా బాక్సింగ్‌లో ప్రపంచ కప్ గ్రహీత వి.దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగిన ఫైనల్స్‌లో గెలుపొందిన మూడు జట్లకు జ్ఞాపికలు, బహుమతులు అందజేసి అభినందించారు. వ్యాఖ్యాతగా డాక్టర్ ఎస్.రమేష్‌బాబు వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఇరుకుల రామకృష్ణ మాట్లాడుతూ, వాణిజ్య రంగంలో ఏడాది పొడవునా బిజీగా గడుపుతున్న ఆర్యవైశ్యులకు క్రీడలపై ఆసక్తి, వినోదం అందించాలన్న సంకల్పంతో రెండు నెలల వ్యవధిలోనే వాసవీ ప్రీమియర్ లీగ్-టీ7 వన్‌డే టోర్నమెంట్‌ను సుజాతా రమేష్‌బాబు సమష్టి కృషితో విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా అతిథులను, వాసవీయన్లను జ్ఞాపికలతో సంప్రదాయబద్ధంగా సత్కరించారు.

ఆకట్టుకున్న 'శ్రీకృష్ణ లీలలు' ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

పెరంబూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో ఆదివారం శ్రీ కృష్ణ జయంతి వేడుకలు కోలాహలంగా సాగాయి. కన్నియాకుమారి జిల్లా సరిహద్దులోని పురాతనమైన మీనాచల్ శ్రీకృష్ణాలయంలో కృష్ణ జయంతి ఉత్సవాలు ఈ నెల 10వ తేది ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం మహాగణపతి పూజ, కలశ పూజ, కలశాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం 'శ్రీ కృష్ణ లీలలు' పేరుతో విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. కృష్ణుడి బాల్య కాలక్షేపాలు, అల్లరి కథలు తదితరాలను కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో విద్యార్థులు ప్రదర్శించిన ఘట్టాలు భక్తులను అలరించాయి.


హైకోర్టు రిజిస్ట్రార్ పూవరాజ్ - తమిళి సై - మంత్రి ఆర్.గాంధీ

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో తమిళనాడు చేనేత, హ్యాండ్‌లూమ్ శాఖల మంత్రి ఆర్.గాంధీ, తెలంగాణా మాజీ గవర్నర్, బీజేపీ నాయకురాలు తమిళి సై, మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ పూవరాజ్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఈమేరకు వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

సంగీతంతో మానసికోల్లాసం

● సేవారత్న శోభారాజా


భగవద్గీతను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జె.శ్రీనిబాబు

ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగీతంతో మానసికోల్లాసం లభిస్తుందని తెలుగు భాషాభిమాని, సేవారత్న శోభారాజా పేర్కొన్నారు. వెస్ట్ మాంబళం లోని అయోధ్య మండపంలో శనివారం రాత్రి కళారంజని ఫౌండేషన్, కళారంజని మ్యూజిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో భక్తిసంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వాహకులు జే శ్రీనిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని మణిమాల రావు, వసంతరాణి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా కలైమామణి డాక్టర్ జె.సుబ్రమణ్యం, సేవారత్న శోభారాజా, జ్ఞానసరస్వతి శాంతి సురేష్, సమాజ సేవకులు వైజి.మధువంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శోభారాజా మాట్లాడుతూ, సంగీతంపై ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకోవాలని, సంగీతం విన్నా, పాడినా మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. సంగీత కళాకారులు డాక్టర్ శ్రీనిబాబు తన సంగీత ప్రజ్ఞతో ఎంతోమంది మనసులో చెరగని ముద్రవేశారని, ఆయన సంగీత ప్రయాణం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీనిబాబు సారథ్యంలో 21 రాగాలతో 108 మంది సంగీత విద్యార్థులు లలితా సహస్రనామం పఠించి శ్రోతలను అలరించారు. దానికి ముందు లలితాంబికా దేవిని స్తుతిస్తూ విల్లివాక్కం సుష్మా ప్రసాద్ చేసిన గానం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంగీత విద్యార్థులు, తెలుగు తరుణి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతలకు ఘన సత్కారం



సత్కార గ్రహీతలతో పొన్‌భాస్కరన్, ఇబ్రహీం తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలో తమిళనాడు తరుపున పాల్గొని పతకాలు సాధించిన విజేతలన అన్నానగర్‌లో శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి పొన్‌భాస్కరన్, బాక్సింగ్‌లో ప్రపంచ కప్ గ్రహీత వి.దేవరాజన్ తదితరుల సమక్షంలో బంగారు పతకాలు సాధించిన సంతోష్, మ్యాక్‌డస్, మోనిష సహా సిల్వర్, కాంస్య పతకాలు గెలుచుకున్న విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేసి అభినందించారు. తమిళనాడు బాక్సింగ్ సంఘ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, కార్యదర్శి ఎంఎస్.నాగరాజన్, కోశాధికారి ప్రభు తదితరులు పాల్గొన్నారు.


మహాకుంభాభిషేక మహోత్సవ దృశ్యం

వైభవంగా ప్రసన్న వేంకటేశ్వర పెరుమాళ్ ఆలయ మహా కుంభాభిషేకం

ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని పెరియపాళయం సమీపం పనపాక్కంలోని ప్రసన్న వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం బాలాజీ భక్తజన సభ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఆలయ ట్రస్టీలు ఊసూరు నందకుమార్, ఎం.ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నుంచి చేపట్టిన హోమాలు పురోహితులు జరిపారు. ఉదయం ఆలయ గోపురంపై పవిత్ర జలాలు సంప్రోక్షించి భక్తుల గోవిందనామస్మరణ, మేళతాళాలు, వేద మంత్రోచ్చారణ నడుమ కుంభాబిషేకాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర పెరుమాళ్‌ను విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో అపోలో సుబ్రమణ్యం, కుమరవేల్, ముక్కాల భాష్యకారులు, కాశీవిశ్వనాథన్, లతా నందకుమార్, శశిరేఖ, ఆనంద్‌చెట్టి తదితరులు పాల్గొన్నారు.

తిరుచెందూర్‌కు పోటెత్తిన భక్తులు

ప్యారీస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాలనుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఆలయ ప్రాంగణాల్లో సుమారు 30 జంటలకు వివాహాలు జరిగాయి. తిరుచెందూర్ క్షేత్రానికి శనివారం రాత్రి నుంచే భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని రాత్రంతా అక్కడే గడిపారు. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు విశ్వరూప దీపారాధన, ఉదయం 6 గంటలకు ఉదయమార్తాండాభిషేకం, 10 గంటలకు వృశ్చికాభిషేకం తదితర పూజలను శివాచార్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుండే సముద్రంలో స్నానమాచరించి సుమారు 4 గంటల పాటు క్యూలైన్లలో వేచివుండి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని షణ్ముగ విలాస మండపం, మాడవీధుల్లో వివాహం చేసుకున్న నూతన వధూవరులు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కిటకిటలాడాయి. తిరుచెందూర్ ఆలయ ప్రాంగణంలోనే కాకుండా సన్నిధి వీధి, రథవీధులు, ప్రధాన వీధుల్లో ఉన్న కల్యాణమండపాలు వివాహాలతో కళకళలాడాయి.


ఆలయంలో పోటెత్తిన భక్తులు


కృష్ణగిరి వద్ద ఆదివారం ఉదయం ఏర్పాటైన సభలో పాల్గొనేందుకు వెళుతూ మార్గమధ్యంలో తనకు స్వాగతం పలికేందుకు బారులు తీరిన మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.